క్లుప్తంగా

కార్మిక చట్టం వర్తింపజేయాలి

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు



పాదయాత్రలో సీపీఎం నేతలు

పొదలకూరు : జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో కార్మిక చట్టం వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు అన్నారు. మండలంలో సీపీఎం నిర్వహిస్తున్న పాదయాత్రలో భాగంగా శనివారం పొదలకూరులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సర్వేపల్లి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 13వ తేదీన నెల్లూరు నర్తకీ సెంటర్‌లో జరిగే బహిరంగ సభ వద్దకు తమ పాదయాత్ర చేరుకుంటుందన్నారు. పరిశ్రమల నుంచి వెదజల్లే కాలుష్యాన్ని నివారించాల్సిందిగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్, తిరుపాల్, ప్రసాద్, మండల ఇన్‌చార్జి కె.పెంచలయ్య, బి.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్



మాట్లాతున్న లక్ష్మీ సునంద

నెల్లూరు సిటీ: జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని కేన్సర్ విభాగంలో బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద పేర్కొన్నారు. శనివారం ఆమె జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అక్టోబర్ నెలను రొమ్ము కేన్సర్ అవగాహన మాసంగా పరిగణించి జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్దానాయక్ సహకారంతో వైద్యులు పద్మావతి, ఇంద్రజ, హరిప్రియ పర్యవేక్షణలో స్క్రీనింగ్ సేవలను అందిస్తున్నామని తెలిపారు. వైద్యపరీక్షల్లో కేన్సర్ లక్షణాలు ఉన్నట్లు గుర్తిస్తే ఎఫ్ఎన్ఏసీ బయాప్సీ ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తామన్నారు. కేన్సర్ నిర్ధారణ అయిన రోగికి తగిన వైద్య సేవలను అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని 40 ఏళ్లు పైబడిన స్త్రీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలల సమగ్ర సంరక్షణ పథకంపై సమీక్ష

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో ఐసీడీఎస్ పీడీ హెనాసుజన్ ఆధ్వర్యంలో బాలల సమగ్ర సంరక్షణ పథకంపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నిర్వహించిన ఈ సమావేశంలో బాలల సమగ్ర సంరక్షణ పథకం స్పాన్సర్లకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈ సమావేశంలో బాలల సమగ్ర సంరక్షణ డీసీపీఓ సురేష్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులకు భారీగా అపరాధ రుసుం

నెల్లూరు(క్రైమ్)/నెల్లూరు(లీగల్): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన మందుబాబులకు న్యాయమూర్తి శనివారం భారీగా అపరాధ రుసుం విధించారు. మద్యం మత్తులో ఘర్షణలు, రోడ్డు ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్నీ పోలీసు స్టేషన్‌ల పరిధిలో పోలీసు అధికారులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వందల సంఖ్యలో కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. నిన్న, మొన్నటి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనచోదకులకు కోర్టు రూ.2వేల నుంచి రూ.2,500 వరకు అపరాధ రుసుం విధించేది. అధికంగా మద్యం సేవించి ఉంటే పర్సంటేజీను బట్టి జైలు శిక్ష విధించేది. అయినా వాహనచోదకుల్లో మార్పు రాకపోవడంతో అపరాధ రుసుంను కోర్టు రూ.10వేలకు పెంచింది. తాజాగా చిన్నబజారు పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 9 మందికి సెకెండ్ ఏడీఎం కోర్టు న్యాయమూర్తి ఎల్ శారదారెడ్డి శనివారం రూ.10వేలు చొప్పున అపరాధ రుసుం. విధించారు. తాజాగా అపరాధ రుసుం విధించిన వారిలో సాయిశ్రీనివాసులు, విజయభాస్కర్, చలపతి, సమీరుల్లా, వేణుగోపాల్, ముక్తియార్, హనీఫ్, భగవత్ సింగ్, రాయక్ ఉన్నారు.

రేపు జిల్లా ఫెన్సింగ్ జట్ల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉమ్మడి నెల్లూరు జిల్లా సీనియర్ స్త్రీ, పురుషుల ఫెన్సింగ్ జట్ల ఎంపికలను నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పీ వేణుగోపాల్ రెడ్డి, జీ గురవయ్య శనివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సాయంత్రం 3 గంటలకు ప్రారంభమయ్యే ఎంపికలకు 13 ఏళ్లు నిండిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ధ్రువీకర ణపత్రాలతో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 919866 046081 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు అపూర్వ స్పందన

- ఉచితంగా మందుల పంపిణీ

కొడవలూరు : మండలంలోని మానేగుంటపాడులో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి అపూర్వ స్పందన లభించింది. 452 మంది వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శస్త్ర చికిత్సలు, మెరుగైన వైద్యం అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందించేలా వైద్యులు చర్యలు తీసుకున్నారు. ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు మనీష్, ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు రాజేష్‌రెడ్డి, కంటి వైద్య నిపుణురాలు శశికల, కొడవలూరు పీహెచ్‌సీ వైద్యులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు, యల్లాయపాళెం వైద్యాధికారిని లత హాజరై వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఎంతో మంది పేదలు పైసా ఖర్చులేకుండా మెరుగైన వైద్య సేవలు పొందే వెసులుబాటు సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జి.వసంతకుమారి, ఈఓపీఆర్డీ డేవిడ్, వైఎస్సార్‌సీపీ నేతలు నీలకంఠం శ్రీధర్‌రెడ్డి, బాలభాస్కర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఎస్.విజయలక్ష్మి, డి.సురేష్‌కుమార్, జి.రాధాకృష్ణ, జి.జాలయ్య, అన్వేష్, హెచ్ఏలు వెంకట్రావు, షఫీఉద్దీన్ పాల్గొన్నారు.

ముంగిటకే ఖరీదైన వైద్యం

ముత్తుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదల ముంగిటకే ఖరీదైన వైద్యం అందిస్తున్నారని ప్రజాప్రతినిధులు అన్నారు. మండలంలోని నేలటూరు సచివాలయంలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ గండవరం సుగుణ, సర్పంచ్ కనకయ్య పాల్గొన్నారు. పేదలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం 360 మందికి వైద్య నిపుణులు మౌనిక, సునీల్‌కుమార్,



కొడవలూరు : ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

శ్రీనివాసులు, హర్షిత తదితరులు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈదూరు కోటారెడ్డి, ఈపూరు గిరిధర్‌రెడ్డి, జానకిరామిరెడ్డి, సూపరింటెండెంట్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

పూడిపర్తిలో..

వెంకటాచలం : మండలంలోని పూడిపర్తి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు స్పెషలిస్ట్ వైద్యులు శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కోడూరు రఘునాథరెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ డక్కిలి రమణయ్య, సర్పంచ్ డక్కిలి శ్రావణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నల్లపాళెంలో..

పొదలకూరు : మండలంలోని నల్లపాళెం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును శనివారం నిర్వహించారు. గ్రామస్తులకు వివిధ రకాల జబ్బులను పరీక్షించుకునేందుకు వైద్యనిపుణులు శిబిరంలో పాల్గొన్నారు. మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహారావు పర్యవేక్షణలో క్యాంపును ఏర్పాటు చేశారు. హెల్ప్‌డెస్క్ ద్వారా క్యాంపునకు వచ్చిన రోగులను వలంటీర్లు, సిబ్బంది వైద్యనిపుణుల వద్దకు తీసుకెళ్లారు. సర్వేలో అందజేసిన టోకెన్ల ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి, స్థానికులు పార్లపల్లి శ్రీనివాసులురెడ్డి, నంది శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు

తోటపల్లిగూడూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంతో పేదల ఇంటి ముంగిటకే మేలైన వైద్య సేవలను అందిస్తున్నట్లు నెల్లూరు ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్ పేర్కొన్నారు. తోటపల్లిగూడూరు, తోటపల్లి గ్రామాలకు సంబంధించి తోటపల్లిగూడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు శనివారం జరిగింది. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం గౌడ్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని భావించిన ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ఏర్పాటు చేస్తోందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 625 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వరిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారిణి రాధిక తన సిబ్బందితో వైద్య పరీక్షలు చేయడంతో పాటు రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లావణ్య, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మన్నెం చిరంజీవులగౌడ్, స్థానిక నాయకులు ఈదూరు రామాచార్యులు, పాకం ప్రవీణ్‌కుమార్, ఎంబేటి వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష.. ప్రజలకు శ్రీరామరక్ష

మనుబోలు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు శ్రీరామరక్ష అని ఎంపీపీ గుండాల వజ్రమ్మ అన్నారు. మండలంలోని జట్లకొండూరు గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పలురకాల సేవలను ఇప్పటికే ప్రజల ముంగిటకు తెచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్షతో వైద్య సేవలను సైతం ప్రజల ముంగిటకు తీసుకొచ్చారన్నారు. పైసా ఖర్చు లేకుండా ఇంటి ముంగిటకే వైద్య సేవలను అందజేయడం ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం ఆరోగ్య సురక్ష నియోజకవర్గ ప్రత్యేకాధికారి, స్పెషల్ కలెక్టర్ ఓబులేసు ఈ శిబిరాన్ని సందర్శించారు. ఇక్కడికి వచ్చే రోగులకు అన్ని వసతులు సమకూర్చాలన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యులు గేయ పూజిత, చందన, వేమయ్య, జ్ఞానప్రసూన రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ



మనుబోలు : మాట్లాడుతున్న ఎంపీపీ వజ్రమ్మ

కార్యక్రమంలో సర్పంచ్ నాగమ్మ, ఉప సర్పంచ్ తులసీరాం, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, గుంజి రమేష్, ఎంపీడీఓ ప్రసాద్, ఏఓ రవికుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

కోవూరు (విడవలూరు) : ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నేత పూండ్ల అచ్యుత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముదివర్తి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం శనివారం జరిగింది. ఈ సందర్భంగా రోగులకు పలురకాల వైద్యసేవలు అందించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విడవలూరు: జగనన్న సురక్ష శిబిరంలో భాగంగా 104 వాహనంలో ఈసీజీ చేస్తున్న వైద్య సిబ్బంది



ముత్తుకూరు : ఆరోగ్య సురక్షలో పేదలకు మందులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



తోటపల్లిగూడూరు : రోగులకు మందులను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



విడవలూరు : పౌష్టికాహార ప్రదర్శనలో అధికారులు, ప్రజాప్రతినిధులు



వెంకటాచలం : ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన ప్రజలు

శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం) : జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పోస్టర్లను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. నెల్లూరులోని ఎమ్మెల్యే ప్రసన్న నివాసంలో వీటిని ఆవిష్కరించి ప్రదర్శించారు. ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి రావు, వైఎస్సార్‌సీపీ నేత బాలశంకర్‌రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా సీహెచ్‌సీలో వైద్యసేవలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలను అందిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరు సీహెచ్‌సీలో అదనపు ఆపరేషన్ థియేటర్, రూ.2.50 లక్షల విలువైన డెంటల్ చైర్‌ను మంత్రి కాకాణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీహెచ్‌సీలో గర్భిణులకు కాన్పు కష్టంగా మారితే సిజేరియన్ కూడా చేస్తున్నట్లు తెలిపారు. సీహెచ్‌సీని ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా తాను మిగిలిన సభ్యులు కలిసి నిర్ణయాలు తీసుకుని వైద్య సేవలను విస్తరించినట్లు చెప్పారు. తనకు చదువు చెప్పిన వాకాటి వెంకురెడ్డి కుమారులు శ్రీనివాసులురెడ్డి, శివప్రసాద్‌రెడ్డి కలిసి ఆపరేషన్ థియేటర్ టేబుల్‌ను అందజేయడం సంతోషంగా ఉందని మంత్రి చెప్పారు. ఇక్కడ అత్యాధునిక వైద్యపరికరాలతో పాటు, నిపుణులైన వైద్యుల నియామకం జరిగిందన్నారు. పది మంది వైద్యులు ఇక్కడ పనిచేస్తున్నారని, పూర్తిస్థాయిలో సీహెచ్‌సీలో వైద్యుల నియామకం జరిగిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో భవనం నిర్మించారని, తర్వాత పట్టించుకోకపోవడం వల్ల సీహెచ్‌సీ అనేక విమర్శలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని, పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందిస్తుండడం వల్ల రోగుల సంఖ్య బాగా పెరిగిందన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, ఇతర శస్త్రచికిత్సలు కూడా ఇక్కడే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. పేదల చెంతకే వైద్యాన్ని తీసుకుని వెళ్తున్నామని, 104 వాహనం, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఇందులో భాగమేనన్నారు. మంత్రి వెంట డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ శివకృష్ణ, హెచ్‌డీసీ మెంబర్లు వాకాటి శ్రీనివాసులురెడ్డి, మొలబంటి శేఖర్‌బాబు, వైస్ ఎంపీపీలు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సోమా అరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్, పార్టీ నేతలు పెద మల్లు రమణారెడ్డి, కోనం చినబ్రహ్మయ్య, మద్దిరెడ్డి రమణారెడ్డి, ఎస్కే అంజాద్, ఎం.శివశంకర్ తదితరులు ఉన్నారు.



సీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

రికార్డులు పకడ్బందీగా లేకుంటే రికవరీ

- డ్వామా పీడీ వెంకటరావు
- సోషల్ ఆడిట్లో రూ.41,315 రికవరీ

పొదలకూరు : రికార్డులు పకడ్బందీగా లేకుంటే ఎఫ్ఏలు, టీఏల నుంచి రికవరీ చేస్తామని డ్వామా పీడీ, సోషల్ ఆడిట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ డి.వెంకటరావు హెచ్చరించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి నెలాఖరు వరకు మండల సోషల్ ఆడిట్ ప్రజావేదికను స్థానిక ఎంపీపీ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.41,315 రికవరీ పడిందన్నారు. ఇందులో వెంటనే రూ.31,819 వసూలు చేశామన్నారు. మొత్తంగా చూసుకుంటే పెద్ద మండలం అయినప్పటికీ రికవరీ స్వల్పస్థాయిలో ఉందన్నారు. మండలంలోని పంచాయతీలో జరిగిన పనుల్లో చిన్నపాటి పొరపాట్లు మాత్రమే ఉన్నాయన్నారు. సాంకేతిక సమస్యల కారణంగా కొందరు ఎఫ్ఏల నుంచి రికవరీ



సోషల్ ఆడిట్లో విచారణ నిర్వహిస్తున్న డ్వామా పీడీ వెంకటరావు

చేయాల్సి వచ్చిందని పీడీ వెల్లడించారు. పెద్దస్థాయిలో అవకతవకలు జరగలేదని, సోషల్ ఆడిట్లో ఫిర్యాదులు కూడా అందలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీహరిరెడ్డి, డీవీఓ సురేష్‌బాబు, ఎస్టీఎం సత్యనారాయణ, ఎంపీడీఓ నగేష్‌కుమారి, క్వాలిటీ కంట్రోల్ డీఈ వేణుగోపాల్, ఎస్ఆర్‌పీ మూర్తి, ఏపీఎం మధుసూదన్ పాల్గొన్నారు.

30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : మండలంలోని కురిచెర్లపాడు పంచాయతీ ఇస్లాంపేట గ్రామానికి చెందిన 30 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. శుక్రవారం గ్రామంలో పర్యటించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వీరంతా వైఎస్సార్‌సీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కాకాణి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వస్తున్నారని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈసందర్భంగా చెప్పారు. పార్టీల ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుండటంతో సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి భారీస్థాయిలో మద్దతు పెరుగుతోందన్నారు.

నమ్మబలికి రూ.3 లక్షలతో పరార్

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

వెంకటాచలం : ఇంటి పక్కనే నమ్మకంగా ఉన్న దంపతులు ఓ మహిళకు చెందిన రూ.3 లక్షల నగదును పోస్టల్ కార్యాలయంలో డిపాజిట్ చేస్తామని చెప్పి ఆ నగదుతో పరారయ్యారు. ఈ ఘటన వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతీ నక్కలకాలనీలో శనివారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు నక్కలకాలనీకి చెందిన కోవూరు లీలమ్మ ఒంటరిగా నివసిస్తోంది. ఈమె ఇంటి పక్కనే ఉన్న దంపతులు మనోజ్, ప్రణవి కొన్నేళ్లుగా లీలమ్మకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. ఈ క్రమంలో లీలమ్మ తన వద్దనున్న రూ.3 లక్షల నగదును నెల్లూరు నగరంలోని పోస్టల్ కార్యాలయంలో డిపాజిట్ చేసేందుకు బాడుగ ఆటో మాట్లాడాలని శుక్రవారం మనోజ్, ప్రణవిలను కోరారు. ఆరోగ్యం సరిగా లేనందును 'నువ్వు వెళ్లలేవని, మేమిద్దరం వెళ్లి నగదు డిపాజిట్ చేస్తామని' నమ్మబలికారు. వారిద్దరి మాటలు నమ్మిన లీలమ్మ తన వద్దనున్న రూ.3 లక్షల నగదును వారికి ఇచ్చింది. డిపాజిట్ చేసి వస్తామని చెప్పిన దంపతుల కోసం లీలమ్మ రాత్రి వరకు ఎదురుచూసింది. శనివారం ఉదయం కూడా ఇంటికి రాకపోవడంతో మోసపోయానని తెలుసుకుని బోరున విలపిస్తూ వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎంపీడీఓ వెంకటరమేష్

వెంకటాచలం : మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని ఎంపీడీఓ వెంకటరమేష్ పేర్కొన్నారు. వెంకటాచలంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. కాగా ఈ సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. దీనిపై పలువురు సభ్యులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సమావేశానికి కొందరు అధికారులు హాజరుకావడం లేదని, అధికారులు రాకుంటే ఎలాగని ప్రశ్నించారు. మళ్లీ జరిగే సమావేశానికి అధికారులందరూ హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. మనబడి నాడు–నేడు పథకం కింద పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, తాగునీరు తదితర అంశాల గురించి సభ్యులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటరమేష్ మాట్లాడుతూ గ్రామాల్లో తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీలు కనుపూరు కోదండరామిరెడ్డి, పచ్చబట్ల మస్తానయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్ మధు, వివిధ శాఖల మండలాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమేష్

పేదలకు పోషకాహారం పంపిణీ

కొడవలూరు : మండలంలోని మానేగుంటపాడులో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు సొంతంగా తయారు చేసిన పోషకాహార పదార్థాలను ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా శిబిరానికి వచ్చిన పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తున్నందున పోషక విలువలపై అవగాహన కల్పించేందుకు ప్రదర్శన, పంపిణీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మమత, దీనమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ చేతుల మీదుగా పోషకాహార పదార్థాల పంపిణీ